RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్ | మంగళవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 26 | డిసెంబర్ 30, 2025 | వెల : రూ.3-00

దినపత్రిక




ఆటో డ్రైవర్ల మానవత్వానికి జై..!

4లో..

# సైలెంట్ మోడ్!

## తెలంగాణలో నిట్టూరుస్తున్న బీజేపీ




3లో..

- ☐ అడపాదడపా మినహా కనపడని కమలం జోష్
- ☐ ఊపు మీదున్న కాంగ్రెస్, బీఆర్ఎస్
- ☐ స్థానిక ఎన్నికల్లో ప్రభావం చూపని పార్టీ
- ☐ అధ్యక్షుడి మార్పుతోనైనా కనిపించని మార్పు
- ☐ కేంద్రం ఆశలకు రాష్ట్ర నేతల బ్రేక్
- ☐ బండి సంజయ్ దూకుడు మిస్ అవుతున్న కేడర్
- ☐ ద్వితీయ శ్రేణి నాయకత్వం అయోమయం
- ☐ వలసలతో కేడర్‌లో నైరాశ్యం
- ☐ వచ్చే ఎన్నికల్లో ఢిల్లీ లెక్కలు తప్పనున్నాయా?

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో :**

తెలంగాణ రాజకీయాల్లో మూడవ ప్రత్యామ్నాయంగా ఎదిగిన భారతీయ జనతా పార్టీ, ప్రస్తుతం ఒక క్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. కేంద్ర నాయకత్వం తెలంగాణపై భారీ ఆశలు పెట్టుకున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. తెలంగాణలో గత ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా అడుగులు వేసిన బీజేపీ, ఇప్పుడు సొంత ఇంటిని చక్కదిద్దుకోవడంలోనే సతమతమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు, సీట్లు పెంచుకున్నా.. ఆ ఊపును కొనసాగించడంలో పార్టీ విఫలమవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీలో ఒక రకమైన స్తబ్ధత ఆవహించింది. బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించిప్పటినుంచీ పార్టీ నిట్టూరుస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత కిషన్ రెడ్డిని నియమంచినా పార్టీలో ఏ మార్పూ కనపడ లేదు. ఇక రామచందర్ రావుకు బాధ్యతలు అప్పగించినప్పటి నుంచీ పార్టీలో జోష్ తగ్గిందనేది కార్యకర్తల అంతర్గత మాట. బండి సంజయ్ హయాంలో ఉన్న దూకుడు, రామచందర్ రావు సాఫ్ట్ విధానంలో కనిపించడం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. అధ్యక్షుడిని మార్చినా, పార్టీ శ్రేణుల్లో కదలిక రాకపోగా.. గ్రూపు రాజకీయాలు మరింత పెరిగాయని రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా జరుగుతోంది.

**– ఎవరి గ్రూపు వారిదే!**

తెలంగాణ బీజేపీలో ప్రస్తుతం కీలక నేతల చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. అధ్యక్షుడిగా ఉన్న రామచందర్ రావు పార్టీని సమన్వయం చేయడంలో బిజీగా ఉన్నా, ప్రజాక్షేత్రంలో గట్టిగా వాయిస్ వినిపించడంలో వెనుకబడ్డారనే విమర్శ ఉంది. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు ఉన్నప్పటికీ, తనదైన శైలిలో క్యాడర్‌లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు.

## ఇద్దరి సంతకాలు తప్పనిసరి..

- సర్పంచ్, ఉప సర్పంచ్ ఇద్దరి భాగస్వామ్యం ఉండాలి
- గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో కీలక మార్పు
- చెక్కుల చెల్లింపులకు కొత్త నిబంధనలు
- పారదర్శకత, జవాబుదారీతనమే లక్ష్యం




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై గ్రామపంచాయతీ నిధులకు సంబంధించి జారీ చేసే చెక్కులపై సర్పంచ్, ఉప సర్పంచ్ ఇద్దరి సంతకాలు ఉంటేనే బ్యాంకులు చెల్లింపులు చేయాలని స్పష్టం చేసింది. ఒకరి సంతకం మాత్రమే ఉన్న చెక్కులను స్వీకరించవద్దని బ్యాంకులకు సూచనలు ఇచ్చింది. పంచాయతీ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడం, గ్రామస్థాయిలో పాలనలో జవాబుదారీతనాన్ని

మిగతా 3వ పేజీలో..

# సారొచ్చారు.. వెళ్లారు..

- తొలి రోజు అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరు
- సభ నుంచి కాసేపట్లోనే నిష్క్రమణ
- గులాబీ బాస్ కు షేక్ హ్యాండ్ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి
- జనవరి 2 నుంచి సమావేశాలు పున: ప్రారంభం
- నీళ్ల వివాదాలతో వేడెక్కనున్న అసెంబ్లీ

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో:**




తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాలు సోమవారం ఉదయం 10:30 గంటలకు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ సమావే శాలకు ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు హాజరుకావడం రాజకీయంగా విశేషంగా మారింది. చాలాకాలం తర్వాత అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్ హాజరు, సభా వాతావరణాన్ని ఒక్కసారిగా ఆసక్తికరంగా మార్చింది. సభ ప్రారంభమైన వెంటనే దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు శాసనసభ సంతాపం తెలిపింది. సభ్యులు కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సభలో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది.

**సీఎం రేవంత్ రెడ్డి.. కేసీఆర్ కరచాలనం**

సభలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నేరుగా కేసీఆర్ కూర్చున్న సీటు వద్దకు వెళ్లారు. స్వయంగా షేక్‌హ్యాండ్ ఇచ్చి పలకరించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. సిద్ధాంతపరంగా రాజకీయంగా తీవ్ర విభేదాలు ఉన్నా, సభలో కనిపించిన ఈ మర్యాదపూర్వక వ్యవహారం సభ్యులతో పాటు ప్రజలను కూడా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ దృశ్యం 'సీన్ ఆఫ్ ది ఇయర్'గా వైరల్ అయింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కేసీఆర్ వద్దకు వెళ్లి పలకరించారు. అలాగే శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్ తదితర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కేసీఆర్‌తో మాట్లాడారు. కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కేసీఆర్ ఆశీర్వాదం తీసుకోవడం కూడా చర్చనీయాంశమైంది.


**కాసేపట్లోనే సభ నుంచి కేసీఆర్ నిష్క్రమణ**

సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి, సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. హరీష్ రావుతో కలిసి అసెంబ్లీ నుంచి నేరుగా నందినగర్ నివాసానికి వెళ్లినట్లు సమాచారం. సభలో జీరో అవర్ కొనసాగుతుండగా కేసీఆర్ నిష్క్రమణపై అధికార పార్టీలో కొందరు మంత్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, సభ నుంచి కేసీఆర్ త్వరగా వెళ్లిపోవడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. దివంగత సభ్యులకు మౌనం పాటించిన తర్వాత కేసీఆర్ వెళితే మరింత బాగుండేదని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలు ఇటీవల తరచుగా కేసీఆర్ అసెంబ్లీకి రావాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన హాజరు ప్రాధాన్యత సంతరించుకున్నప్పటికీ, కాసేపే ఉండి వెళ్లడం రాజకీయంగా చర్చకు దారి తీసింది.

మిగతా 3వ పేజీలో..

# హైలెస్సో.. హైలెస్సా..!

- ☐ వైభవంగా గోదావరిలో సీతారాముల తెప్పోత్సవం
- ☐ భక్తాద్రిగా మారిన భద్రాద్రి!
- ☐ బాణాసంచా వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగొందిన రామయ్య నదీ విహారం



వేద న్యూస్, భద్రాచలం:

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు ఆధ్యాత్మిక వైభవంతో కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా సోమవారం గోదావరి నదిలో నిర్వహించిన తెప్పోత్సవం భక్తులను పరవశింపజేసింది. హంసవాహనంపై మంగళ వాయిద్యాలు, వేద పారాయణలు నడుమ స్వామివారి నదీ విహారం దివ్యంగా సాగింది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీరామయ్య సూర్యప్రభ వాహనంపై వేంచేసి ఒకవైపు భక్తులను అనుగ్రహిస్తూ, మరోవైపు పంచభూత ప్రసన్నుడై పవిత్ర గోదావరిలో ఐదు సార్లు విహరించారు. వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా దశావతారాలలో భక్తులకు దర్శనం ఇచ్చిన రామయ్య, సీతా లక్ష్మణ సమేతుడై నదీ విహారానికి రావడంతో గోదారమ్మ సైతం పులకించిందన్న భావన భక్తుల్లో వెల్లివిరిసింది. డిసెంబర్ 20 నుంచి కొనసాగుతున్న అధ్యయనోత్సవాలలో భాగంగా దశావతార సేవల అనంతరం సోమవారం ఉదయం నిత్య విధులు నిర్వహించారు. పగల్ పత్తు సమాప్తిని సూచిస్తూ పరకాల మునులు పరమ పదోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఇప్పటివరకు నిర్వహించిన వేద పారాయణలు ఈ ఉత్సవంతో ముగిశాయి.

**బాణాసంచా వెలుగుల్లో నదీ విహారం..**

సాయంత్రం 4 గంటల వేళ వేద మంత్రోచ్ఛారణలు, మేళతాళాలు, మంగళ వాయిధ్యాలు, భక్తుల కోలాటాలు, 'జయ జయ' నినాదాల మధ్య స్వామివారు గోదావరి తీరానికి బయలుదేరారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సుందరంగా అలంకరించిన హంసవాహనంలో సూర్యప్రభ వాహనంపై వేంచేపు చేశారు. అనంతరం పంచభూతాలను ప్రసన్నం చేస్తూ పవిత్ర గోదావరిలో ఐదు ప్రాంతాలలో ఐదు సార్లు విహరించారు. స్వామివారి నదీ విహారం సమయంలో వెలిసిన బాణసంచా వెలుగులు, ఆకాశం నుంచి ముక్కోటి దేవతలు రంగురంగుల పూల వర్షం కురిపిస్తున్నట్లుగా భక్తులకు అనుభూతినిచ్చాయి. ఈ దివ్య వేడుకను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు భద్రాచలం చేరుకోవడంతో భద్రాద్రి పూర్తిగా భక్తాద్రిగా మారింది. దివ్యక్షేత్రమంతా శ్రీరామ నామస్మరణతో మారుమ్రోగుతూ ఆధ్యాత్మిక వాతావరణంతో పరవశించింది.

# కేసీఆర్ ఎందుకు వెళ్లిపోయారో ఆయననే అడగాలి

- సీఎం రేవంత్ రెడ్డి
- అసెంబ్లీ లాబీలో మీడియాతో సీఎం చిట్‌చాట్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావు అసెంబ్లీ నుంచి ఎందుకు వెళ్లిపోయారో తనకు తెలియదని, ఆ ప్రశ్న ఆయననే అడగాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులను కలిసిన

మిగతా 3వ పేజీలో..

# అసమాన్యుడు 'అయూబ్'

- అంచెలంచలుగా ఎదిగిన తీరు..
- ఎత్తిన జెండా దించని నేతగా గుర్తింపు
- కష్టకాలంలోనూ 'చేతి'ని వీడని లీడర్
- మూడు రంగుల కాంగ్రెస్ పార్టీ సైనికుడు
- విధేయుడికి డీసీసీ పీఠం బాధ్యతలిచ్చిన అధిష్ఠానం
- కాంగ్రెస్ వరంగల్ జిల్లా రథ సారథిగా మహ్మద్ అయూబ్

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

కష్టపడితేనే కింది నుంచి పై స్థాయికి అంచెలంచెలుగా ఎదగొచ్చు. నీతిగా పని చేస్తేనే గుర్తింపు ఉంటుంది. అలా కృషి, పట్టుదలతో పని చేసి.. ఎత్తిన జెండా దించకుండా.. కష్టకాలంలోనూ 'చేతి'ని వీడకుండా ముందుకు సాగిన వ్యక్తి అతను. అది గుర్తించిన అధిష్ఠానం విధేయతకు పెద్ద బాధ్యతలను అప్పగించింది. మూడు రంగుల జెండా పార్టీకి వరంగల్ జిల్లా రథసారథిగా ముందుకు నడిపించాలని కాంగ్రెస్ హైకమాండ్ దిశానిర్దేశం చేసింది. ఈ క్రమంలో వరంగల్ డీసీసీ ప్రెసిడెంట్ మహ్మద్ అయూబ్ ఆ దిశగా బలంగా అడుగులు వేస్తున్నారు.

**– కరుడుగట్టిన కాంగ్రెస్‌వాది**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా పేరు గాంచి చారిత్రక నేపథ్యం కలిగిన ప్రాంతంగా వరంగల్ ఉంది. అలాంటి చోట పట్టు నిలుపుకునేందుకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యతిస్తుంటాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేస్తూ.. అందుకు అనుగుణంగా ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తున్నది. వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్ష పదవికి జిల్లా మంత్రితో పాటు ఎమ్మెల్యేల సిఫారసులు కాదని.. అధిష్ఠానం అయూబ్ పేరును ఫైనల్ చేసినట్లు కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలుస్తోంది. 1991లో ఆర్ట్స్, సైన్స్ కాలేజీ ఎన్ఎస్‌యూఐ కార్యదర్శిగా ఉన్న అయూబ్.. క్రమంగా కాంగ్రెస్ పార్టీలో ఎన్నో పదవులు చేపట్టారు. ఎత్తిన జెండా దించకుండా కరుడుగట్టిన కాంగ్రెస్‌వాదిగా, మూడు రంగుల జెండా పార్టీ సైనికుడిగా ముందుకు సాగుతూ.. కష్టకాలంలోనూ 'చేతి'ని వీడలేదు. ముఖ్యంగా గత బీఆర్ఎస్ పాలనలో పదేండ్ల పాటు ఎందరో కాంగ్రెస్ నాయకులు పార్టీని వీడి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. కానీ, అయూబ్ అలా కాకుండా ఎత్తిన జెండా దించకుండా.. విలువలకు కట్టుబడి ఒకే పార్టీకి విధేయుడిగా ఉన్నారు. అదే కలిసొచ్చింది. కాంగ్రెస్ అధిష్ఠానం అయూబ్‌ను వరంగల్ డీసీసీ ప్రెసిడెంట్‌గా నియమించింది. దీంతో వరంగల్ జిల్లాలో అధికార పార్టీలో రాజకీయం రసవత్తరంగా సాగుతోంది.



**– సేవాసారథి సర్వర్ తనయుడు**

కాంగ్రెస్ కార్యకర్తగా, నాయకుడిగా మహ్మద్ అయూబ్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. బ్లడ్ డొనేషన్, హెల్త్ క్యాంపులు ఆయన ఆధ్వర్యంలో నిర్వహించడమే కాకుండా వరద బాధితుల సహాయర్థం దుస్తుల పంపిణీ,మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ వంటి కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ధర్నాలు చేశారు. మహ్మద్ సర్వర్ తనయుడైన అయూబ్ పేరు అనూహ్యంగా కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్ష పదవికి తెర మీదకు వచ్చి ఫైనల్ అయ్యింది. కాగా, అధిష్టానంతో సత్సంబంధాలు నెరుపుతూ అయూబ్ పార్టీ బలోపేతమై పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.



**– విషయాల పట్ల అవగాహన కలిగిన నేత**

విద్యావంతుడు, అన్ని విషయాల పట్ల అవగాహన కలిగిన నేతగా, మైనార్టీ ప్రతినిధిగా ఉన్న అయూబ్‌ను వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించడంలో హైకమాండ్‌కు ఉండాల్సిన లెక్కలున్నట్లు వినికిడి. అన్ని రకాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకునే ఈ మేరకు ఎంపిక చేసినట్లు తెలుస్తున్నది. టీపీసీసీ కార్యదర్శి, మైనార్టీ సెల్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్‌గా ఉన్న అయూబ్.. వరంగల్ ఎల్బీనగర్‌వాసి. ఈయన ఎన్ఎస్‌యూఐ నుంచి మొదలై రాజకీయంగా కాంగ్రెస్‌తో సుదీర్ఘమైన అనుబంధం కలిగి ఉన్నారు. యూత్ కాంగ్రెస్ నగర, జిల్లా కమిటీల్లో కీలకంగా పని చేసి ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో అనుభవం గడించారు. కాంగ్రెస్ రాష్ట్ర, జాతీయ స్థాయి అగ్రనేతలతో సత్సంబంధాలు నెరుపుతూ.. ముందుకు సాగుతున్నారు. ఇవన్నీ అంశాలు ఆయన్ను డీసీసీ ప్రెసిడెంట్‌గా నియామకంలో కలిసొచ్చిన అంశాలుగా భావించొచ్చు.

**– మార్క్ ఉండేలా కసరత్తు**

క్షేత్రస్థాయిలో కార్యకర్తగా మొదలై జాతీయ పార్టీ కాంగ్రెస్‌కు జిల్లా రథసారథిగా నియమితులైన సందర్భంగా పార్టీ బలోపేతానికి ప్రత్యేకంగా అయూబ్ కసరత్తు చేస్తున్నారు. తనదైన మార్క్ పార్టీలో, రాజకీయాల్లో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఓ రకంగా జిల్లా రాజకీయాలను పక్కనపెట్టేలా చేసి.. అధిష్ఠానం తన వైపు చూసేలా చేసిన అయూబ్.. ఇక కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా తనదైన సంతకం ఉండేలా పార్టీ బలోపేతానికి విశేషమైన కృషి ఉండేలా ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నట్లు కనిపిస్తున్నారు. రాజీవ్ యూత్ ఫోరం కొత్తగూడ మండల అధ్యక్షుడిగా 1992 నుంచి 1994 వరకు, అదే మండల కాంగ్రెస్ కన్వీనర్‌గా 1994-96 వరకు, నర్సంపేట అసెంబ్లీ గూడూరు బ్లాక్ కాంగ్రెస్ కన్వీనర్‌గా 1996-98 వరకు, కొత్తగూడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా1999-2002 వరకు, మైనార్టీ ఫోరం అధ్యక్షుడిగా 2003 నుంచి 2007 వరకు సేవలందించారు. అయూబ్ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లాలో మరింత బలోపేతమై.. మూడు రంగుల జెండా రెపరెపలాడుతుందని కాంగ్రెస్ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



**ప్రొఫైల్:**

పేరు: మహ్మద్ అయూబ్
స్వస్థలం: ఎల్బీనగర్, వరంగల్
పుట్టిన తేదీ:01-05-1973
హోదా: కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు
భార్య పేరు: అమీనా సుల్తానా
పిల్లల పేర్లు: రిహన్, మెహవీన్
నచ్చిన నాయకుడు : రాహుల్ గాంధీ

## మేడారం జాతరకు ఆర్టీసీ భారీ ఏర్పాట్లు

**– జనవరి 25 నుంచి 31 వరకు ప్రత్యేక బస్సుల సేవలు**

**ములుగు, వేద న్యూస్ :**

తెలంగాణలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అతి పెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన లిమేడారం సమ్మక్క సారలమ్మ జాతరలికు వెళ్లే భక్తులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా లక్షల మంది తరలివచ్చే ఈ మహాజాతర నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులను నడపాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్ణయించింది. జనవరి 25 నుంచి 31 వరకు జరిగే జాతర రోజుల్లో ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధిలో మొత్తం 244 ప్రత్యేక బస్సులను మేడారంకు నడపనున్నారు. ఇందులో కొత్తగూడెం డిపో నుంచి 110 బస్సులు, ఇల్లెందు నుంచి 41, భద్రాచలం నుంచి 21, పాల్వంచ నుంచి 15, సత్తుపల్లిఏటూరునాగారం నుంచి 17, చర్ల నుంచి 3, వెంకటాపూర్ నుంచి 6, మణుగూరు నుంచి 16, మంగపేట నుంచి 5, ఖమ్మం నుంచి 10 ప్రత్యేక బస్సులు కేటాయించినట్లు ఆర్టీసీ వెల్లడించింది. భారీ భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని ఘనపూర్, ములుగు, గోవిందరావుపేట, తాడ్వాయి, పస్రా, చల్పూర్ మార్గాల మీదుగా ఈ బస్సులు తిరగనున్నాయి. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు నిరంతరంగా ఈ సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని, మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని స్పష్టం చేశారు. మేడారం జాతరకు వెళ్లే భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.

## రాష్ట్రస్థాయిలో 'ప్రసంగి' ప్ర'ఖ్యాతి'

**– నృత్య పోటీల్లో డ్యాన్స్ స్టూడియో స్టూడెంట్స్ ఘనవిజయం**

**వేద న్యూస్, జమ్మికుంట:**




మిలీనియం శ్రీనివాస్ డ్యాన్స్ అకాడమీ 25 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా కేఎంఎస్ డ్యాన్స్ స్టూడియో, శుభమస్తు ఈవెంట్స్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని కళాభవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో జమ్మికుంటకు చెందిన ప్రసంగి డాన్స్ స్టూడియో అండ్ ఫిట్‌నెస్ సెంటర్ విద్యార్థులు అసాధారణ ప్రతిభను ప్రదర్శించి పలు బహుమతులు కైవసం చేసుకున్నారు. 7 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల జూనియర్ విభాగంలో నిర్వహించిన ఫోక్ డాన్స్, వెస్ట్రన్ డాన్స్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రతిభావంతుల మధ్య ప్రసంగి డాన్స్ స్టూడియో విద్యార్థులు ప్రత్యేక గుర్తింపు పొందడం విశేషం.

**ప్రసంగి డాన్స్ స్టూడియో విద్యార్థుల బహుమతులు:**

ప్రకృతికి జూనియర్ సోలో ఫోక్ డాన్స్ విభాగంలో ప్రథమ బహుమతి, రసగ్నా టీమ్(అవికా, సుధీక్ష, శ్రీనిధి, ప్రకృతి, లాస్య)కు జూనియర్ ఫోక్ గ్రూప్ డాన్స్ విభాగంలో ద్వితీయ బహుమతి,లాస్యకు జూనియర్ సోలో డాన్స్ విభాగంలో తృతీయ బహుమతి లభించింది. విద్యార్థుల నృత్య ప్రదర్శనల్లో లయ, భావవ్యక్తీకరణ, శరీర నియంత్రణ, వేదికపై ఆత్మవిశ్వాసం స్పష్టంగా కనిపించాయని న్యాయనిర్ణేతలు ప్రశంసించారు. ఈ విజయం ప్రసంగి డాన్స్ స్టూడియోకే కాకుండా జమ్మికుంట పట్టణానికి గర్వకారణంగా నిలిచింది.

ఈ విజయాల వెనుక డాన్స్ మాస్టర్ల కృషి, శిక్షణ విధానం కీలకమని పలువురు అభిప్రాయపడ్డారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో నృత్యంపై ఆసక్తి, క్రమశిక్షణ, పోటీ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్న విధానం ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమానికి సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై



విద్యార్థుల నృత్య ప్రదర్శనలను తిలకించి మంత్రముగ్ధులయ్యారు. జమ్మికుంట నుంచి రాష్ట్రస్థాయికి ఎదిగిన ఈ ప్రతిభ భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలని ఆయన ఆకాంక్షిస్తూ విద్యార్థులు, మాస్టర్లను ప్రత్యేకంగా అభినందించారు. హైకోర్టు న్యాయవాది, డాన్స్ మాస్టర్ కట్టా రమేష్, సినిమా కాస్టింగ్ డైరెక్టర్ రామకృష్ణ, న్యాయనిర్ణేత జూపాక ఉమా మహేశ్వర్ తదితరులు ప్రసంగి డాన్స్ స్టూడియో విద్యార్థులు మరియు శిక్షకులను అభినందిస్తూ, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు .ప్రసంగి డాన్స్ స్టూడియో అండ్ ఫిట్‌నెస్ సెంటర్ ప్రొప్రైటర్ ఎన్. శ్రీలత, డాన్స్ మాస్టర్లు ప్రసంగి, కే. విశ్వరాజ్ విజేతలను అభినందించారు.

**'ప్రసంగి' స్టూడియోకి రండి: శ్రీలత**

ఈ సందర్భంగా ఎన్. శ్రీలత సోమవారం మాట్లాడుతూ.. జమ్మికుంటలో ఉన్న ప్రసంగి డాన్స్ స్టూడియోకు జమ్మికుంటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల చిన్న పిల్లలు, యువత, పెద్దవారు కూడా వచ్చి నృత్యాన్ని అభ్యసించాలన్నారు. నృత్యం ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జమ్మికుంట, పరిసర ప్రాంతాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

**వేద న్యూస్, కాసిపేట:**




దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాలేగూడ గ్రామానికి చెందిన ఆడే సంపత్ ఇటీవల తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయమై దేవాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై గంగారం ఆధ్వర్యంలో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్‌ను గుర్తించారు. గుర్తించిన సెల్ ఫోన్‌ను బాధితుడికి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై గంగారం మాట్లాడుతూ.. సెల్ ఫోన్ పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ ఫోన్‌ను బ్లాక్ చేయడంతో పాటు తిరిగి పొందే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. సెల్ ఫోన్ దొరకడంపై బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్ వివరాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని, ఫోన్ పోయిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

## కేయూ ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్ షురూ

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

వరంగల్ జోన్ పరిధిలోని కళాశాలల మధ్య నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం కాకతీయ యూనివర్సిటీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగిన ఈ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఈ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించి వరంగల్ జోన్ క్రికెట్ జట్టుకు ఎంపిక కావాలని, అలాగే వరంగల్ జోన్ నుంచి కాకతీయ యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభాను రావు, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. భాస్కర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఏటివిటీ ప్రసాద్, యూనివర్సిటీ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. కుమారస్వామి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మహ్మద్ అఫ్జల్, మట్టెడ కుమార్, మహమ్మద్ అలీ, ఎర్ర సుమన్, పీడీలు డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ జి. శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.



# సైలెంట్ మోడ్!

## తెలంగాణలో నిట్టూరుస్తున్న బీజేపీ




- అడపాదడపా మినహా కనపడని కమలం జోష్
- ఊపు మీదున్న కాంగ్రెస్, బీఆర్ఎస్
- స్థానిక ఎన్నికల్లో ప్రభావం చూపని పార్టీ
- అధ్యక్షుడి మార్పుతోనైనా కనిపించని మార్పు
- కేంద్రం ఆశలకు రాష్ట్ర నేతల బ్రేక్
- బండి సంజయ్ దూకుడు మిస్ అవుతున్న కేడర్
- ద్వితీయ శ్రేణి నాయకత్వం అయోమయం
- వలసలతో కేడర్‌లో నైరాశ్యం
- వచ్చే ఎన్నికల్లో ఢిల్లీ లెక్కలు తప్పనున్నాయా?

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో :**

తెలంగాణ రాజకీయాల్లో మూడవ ప్రత్యామ్నాయంగా ఎదిగిన భారతీయ జనతా పార్టీ, ప్రస్తుతం ఒక క్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. కేంద్ర నాయకత్వం తెలంగాణపై భారీ ఆశలు పెట్టుకున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. తెలంగాణలో గత ఎన్నికల్లో అధికారమే లక్ష్యం గా అడుగులు వేసిన బీజేపీ, ఇప్పుడు సొంత ఇంటిని చక్కదిద్దుకోవడంలోనే సతమతమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు, సీట్లు పెంచుకున్నా.. ఆ ఊపును కొనసాగించడంలో పార్టీ విఫలమవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీలో ఒక రకమైన స్తబ్ధత ఆవహించింది. బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించిప్పటినుంచీ పార్టీ నిట్టూరుస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత కిషన్ రెడ్డిని నియమంచినా పార్టీలో ఏ మార్పూ కనపడ లేదు. ఇక రామచందర్ రావుకు బాధ్యతలు అప్పగించినప్పటి నుంచీ పార్టీలో జోష్ తగ్గిందనేది కార్యకర్తల అంతర్గత మాట. బండి సంజయ్ హయాంలో ఉన్న దూకుడు, రామచందర్ రావు సాఫ్ట్ విధానంలో కనిపించడం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. అధ్యక్షుడిని మార్చినా, పార్టీ శ్రేణుల్లో కదలిక రాకపోగా.. గ్రూపు రాజకీయాలు మరింత పెరిగాయని రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా జరుగుతోంది.

**– ఎవరి గ్రూపు వారిదే!**

తెలంగాణ బీజేపీలో ప్రస్తుతం కీలక నేతల చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. అధ్యక్షుడిగా ఉన్న రామచందర్ రావు పార్టీని సమన్వయం చేయడంలో బిజీగా ఉన్నా, ప్రజా క్షేత్రంలో గట్టిగా వాయిస్ వినిపించడంలో వెనుకబడ్డారనే విమర్శ ఉంది. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు ఉన్నప్పటికీ, తనదైన శైలిలో క్యాడర్‌లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, పార్టీ అధికారిక కార్యక్రమాలతో సమన్వయం కుదరడం లేదు. ఇక ఈటల రాజేందర్ చేరికల కమిటీ చైర్మన్‌గా ఉన్నా, ఇతర పార్టీల నుంచి నేతలను ఆకర్షించడంలో ఇప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కిషన్ రెడ్డి కూడా కేంద్ర మంత్రిగా ఉంటూ తన వర్గాన్నే ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ నేతల మధ్య సమన్వయం లేకపోవడం, ఎవరికి వారు తమ వర్గాలను కాపాడుకోవడానికే ప్రాధాన్యత ఇస్తుండటంతో ద్వితీయ శ్రేణి నాయకత్వం అయోమయంలో పడింది.

**– సైలెంట్ మోడ్లో పార్టీ..**

గతంలో నిరుద్యోగ మార్చ్‌లు, ధర్నాలు, పాదయాత్రలతో హోరెత్తించిన బీజేపీ, ఇప్పుడు అడపదడపా ప్రెస్ మీట్లు, ఫొటో షూట్ కార్యక్రమాలకే పరిమితమైందనే ఆరోపణలు ఉన్నాయి. సర్పంచ్ ఎన్నికల్లో కూడా పార్టీ అంతగా ప్రభావం ఏమీ చూపించలేకపోయింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ గ్రామాల్లో పట్టుకోసం ప్రయత్నిస్తే.. బీజేపీ మాత్రం తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే చేసింది. అంతేతప్ప.. పల్లెల్లో ఏమాత్రం తన ప్రభావాన్ని చూపించలేకపోయింది. వచ్చే మున్సిపల్ ఎన్నికలకు పార్టీ సన్నద్ధత నామమాత్రంగానే ఉంది. క్షేత్రస్థాయిలో అభ్యర్థులను వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**– వలసలతో కేడర్‌లో నైరాశ్యం**

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి క్యూ కట్టిన నేతలు, ఇప్పుడు తిరిగి కాంగ్రెస్ లేదా సొంత గూటికో వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా ద్వితీయ శ్రేణి నేతల బీజేపీలో ఉండలేక ఇతర పార్టీల కండువాలు కప్పుకుంటున్నారు. జిల్లాల్లో పట్టున్న నేతలు పార్టీ మారుతుండటంతో గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణం దెబ్బతింటోందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం అహర్నిశలూ కృషి చేస్తుంటే.. నాయకులు మాత్రం పట్టించుకోవడం లేదు అనే నైరాశ్యం పార్టీనే నమ్మకున్న కార్యకర్తల్లో బలంగా నాటుకుపోయింది.

**– ఢిల్లీ గల్లీ లెక్క తప్పుతోందా?**

ప్రధాని మోదీ, అమిత్ షా వంటి పెద్దలు తెలంగాణను తమ తదుపరి లక్ష్యంగా చూస్తున్నారు. కానీ, ఇక్కడి నాయకత్వం ఆ అంచనాలను అందుకోవడంలో విఫలమవుతోంది. కేంద్రం ఇచ్చే నిధులు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రాష్ట్ర బీజేపీ విఫలమవుతుందనే సొంత పార్టీ నేతలు, కార్యకర్తలే అసంతృప్తిగా ఉన్నారు. అంతేకాదు. కాంగ్రెస్ తనదైన శైలిలో పథకాలతో దూసుకుపోతుంటే చూస్తూ ఊరుకుంటున్నారు తప్ప.. తమదైన శైలిలో కౌంటర్ ఇచ్చే వారే లేరని ప్రచారం జరుగుతోంది.

**– వచ్చే ఎన్నికల వరకైనా..**

తెలంగాణలో బీజేపీకి ఉన్న అతిపెద్ద బలం నిబద్ధత కలిగిన కార్యకర్తలు. కానీ, ఆ బలాన్ని సరైన దిశలో నడిపించే సమర్థవంతమైన వ్యూహం ప్రస్తుతం కరువైంది. ఢిల్లీ నాయకత్వం ఇక్కడి పరిస్థితులను కేవలం రిపోర్టుల ద్వారా కాకుండా, క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహించి జోక్యం చేసుకోకపోతే.. వచ్చే ఎన్నికల నాటికి బీజేపీ పవర్ హౌస్ నుంచి మళ్ళీ మూడవ ప్రత్యామ్నాయం స్థాయికి పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. కాబట్టి గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి, ఉమ్మడి కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, ప్రజల సమస్యలపై పోరాడాలని పార్టీనే నమ్ముకుని ఉన్న కింది స్థాయి కార్యకర్తలు కోరుతున్నారు.

---

# సారొచ్చారు.. వెళ్లారు..

**బీఏసీ సమావేశం నిర్ణయాలు..**

సభ వాయిదా పడిన తర్వాత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 30న వైకుంఠ ఏకాదశి, 31న ఏడాది చివరి రోజు, జనవరి 1న నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మూడు రోజుల విరామాన్ని ప్రకటించి, అసెంబ్లీ సమావేశాలను జనవరి 2 నుంచి జనవరి 7 వరకు నిర్వహించాలని నిర్ణయించారు.

**కీలక బిల్లులు, చారిత్రాత్మక నిర్ణయాలు**

రాబోయే రోజుల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులు, ఆర్డినెన్సులను ప్రవేశపెట్టనుంది. ముఖ్యంగా హైదరాబాద్ నగర ముఖచిత్రాన్ని మార్చే దిశగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీలను విలీనం చేసే బిల్లు సభ ముందుకు రానుంది. దీని ద్వారా జీహెచ్ఎంసీ పరిధి విస్తరించి, వార్డుల సంఖ్యను 150 నుంచి 300కు పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులకు ఉన్న 'ఇద్దరు పిల్లల నిబంధన'ను తొలగించే చారిత్రాత్మక నిర్ణయానికి ఈ సభలో ఆమోదం లభించే అవకాశం ఉంది. తెలంగాణ జీఎస్టీ సవరణ, ఉద్యోగుల హేతుబద్ధీకరణ, పంచాయతీరాజ్ చట్ట సవరణ వంటి అంశాలపై కూడా చర్చ జరగనుంది.

**నీళ్ల వివాదాలతో వేడెక్కనున్న చర్చలు**

ఈ సమావేశాల్లో కృష్ణా, గోదావరి నదీ జలాల అంశం ప్రధానంగా చర్చకు రానుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్ వ్యవహారం అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ ఉద్రిక్తతకు కారణమైంది. ఈ పథకానికి కేవలం 45 టీఎంసీల కేటాయింపులు కోరడం తెలంగాణకు నష్టమని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, ప్రభుత్వం మాత్రం మొత్తం 90 టీఎంసీల కోటా లక్ష్యంగా తమ ప్రయత్నాలు కొనసాగుతూనే, తక్షణ అనుమతుల కోసమే 45 టీఎంసీల ప్రతిపాదన పెట్టామని స్పష్టం చేస్తోంది. డీపీఆర్‌ను కేంద్రం వెనక్కి పంపడంపై ఇరు పక్షాలు పరస్పరం విమర్శలు గుప్పిస్తున్నాయి. మొత్తానికి, తెలంగాణ అసెంబ్లీ తొలి రోజు సమావేశాలు రాజకీయ మర్యాదలకు ప్రతీకగా నిలిచిన సీఎం-కేసీఆర్ కరచాలనంతో పాటు, రాబోయే రోజుల్లో జరగబోయే వాడీవేడి చర్చలకు వేదికగా మారాయి. జనవరి 2 నుంచి తిరిగి ప్రారంభమయ్యే సమావేశాల్లో కేసీఆర్ హాజరై చర్చల్లో పాల్గొంటారా లేదా అన్నదే ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కీలక ప్రశ్నగా మారింది.

# కేసీఆర్ ఎందుకు వెళ్లిపోయారో ఆయననే అడగాలి

సీఎం, ఈ సందర్భంగా కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోవడంపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు స్పందించారు. కేసీఆర్‌తో తాను ఏం మాట్లాడానో మీకెందుకు చెప్పాలని చమత్కరిస్తూ సమాధానం ఇచ్చారు. అసెంబ్లీకి వచ్చిన కొద్ది నిమిషాల్లోనే కేసీఆర్ బయటకు వెళ్లిపోయిన అంశంపై ఆయననే అడగాలని సీఎం సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. అసెంబ్లీ లాబీని పార్లమెంట్ సెంట్రల్ హాల్ తరహాలో తీర్చిదిద్దుతామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు, మీడియా ప్రతినిధులకు కూడా లాబీలో యాక్సెస్ కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. బడ్జెట్ సమావేశాల నాటికి మండలి వ్యవహారాలను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని వెల్లడించారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం సీఎం అసెంబ్లీ ఛాంబర్‌కు చేరుకుని మంత్రులు, ప్రభుత్వ విప్‌లతో భేటీ అయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. రేవంత్ రెడ్డి శాసనమండలి భవన పునరుద్ధరణ పనులను కూడా పరిశీలించారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్లతో కలిసి మండలి సమావేశ మందిరంలో జరుగుతున్న పునరుద్ధరణ, మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేస్తూ, శాసనసభ-శాసనమండలి సమావేశాలు గౌరవప్రదంగా, సౌకర్యవంతంగా నిర్వహించేలా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజాస్వామ్య సంస్థలకు తగిన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు

# బయట మాటల్లోనూ ఉండాలి..

- సభలో సీఎం సంస్కారం బాగుంది
- పాలమూరు-రంగారెడ్డిపై రంధ్రాన్వేషణ మానాలి
- రేవంత్ రెడ్డి పలకరింపుపై కేటీఆర్ స్పందన

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ ను.. సీఎం రేవంత్ రెడ్డి పలకరించి కరచాలనం చేసి ఆరోగ్య పరిస్థితిని అడగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ముఖ్యమని, అదే సంస్కారం బయట మాటల్లోనూ ఉంటే ఇంకా బాగుంటుందని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రత్యర్థులు పరస్పరం పలకరించుకునే సానుకూల వాతావరణం రాష్ట్రానికి మేలు చేస్తుందన్నారు. తెలంగాణను సాధించిన నాయకుడిగా కేసీఆర్ పట్ల రాష్ట్ర ప్రజలకు గౌరవం ఉందని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి అంశంపై రంధ్రాన్వేషణ మానుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ హితవు పలికారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే ఆ ప్రాజెక్టు పనులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇది చివరకు రాష్ట్రానికే నష్టమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ చిత్తశుద్ధిని చూడాలని, గోదావరి నీటి హక్కుల కోసమే అదనపు టీఎంసీ పనులు చేపట్టారని తెలిపారు. రేవంత్ రెడ్డి దోపిడీని అడ్డుకుంటున్నందుకే తనపై విమర్శలు చేస్తున్నారని, ఆ తిట్లే తనకు దీవెనలని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికారాన్ని కోల్పోయిన వెంటనే పార్టీని వీడిన నేతలను తిరిగి ఆహ్వానించకూడదన్నది తన అభిప్రాయమని కేటీఆర్ చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తల బలంతోనే సర్పంచ్ ఎన్నికల్లో విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మారాయని, సర్పంచ్ ఎన్నికల్లో ఎదురైన వ్యతిరేకత కారణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టడం లేదని విమర్శించారు. ఫైనాన్స్ కమిషన్ నిధుల కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# ఇద్దరి సంతకాలు తప్పనిసరి..

బలోపేతం చేయడమే ఈ నిర్ణయానికి ప్రధాన ఉద్దేశ్యమని ప్రభుత్వం తెలిపింది. గ్రామాభివృద్ధి పనులకు కేటాయించే నిధులు సక్రమంగా వినియోగం కావాలంటే సమిష్టి బాధ్యత అవసరమని పేర్కొంది. ఈ నిబంధనను కఠినంగా అమలు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, పంచాయతీ రాజ్ అధికారులు, సంబంధిత సిబ్బందికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎలాంటి మినహాయింపులు లేకుండా ప్రతి గ్రామపంచాయతీలో ఈ విధానం అమలులో ఉండాలని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో గ్రామపంచాయతీల్లో ఆర్థిక వ్యవహారాల్లో నియంత్రణ పెరుగుతుందని, ప్రజలకు నిధుల వినియోగంపై మరింత విశ్వాసం ఏర్పడుతుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

# ఎడ్‌సెట్ కన్వీనర్‌గా వెంకట్రామ్ రెడ్డి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



2026-27 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ టీజీ ఎడ్ సెట్-2026కు కన్వీనర్‌గా వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన ఆచార్యులు బి. వెంకట్రామ రెడ్డిని నియమిస్తూ తెలంగాణా కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ వి. బాలకిష్టా రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 2025 సంవత్సరానికి కూడా ఆచార్య వెంకట్రామ్ రెడ్డి ఎడ్ సెట్ కన్వీనర్‌గా వ్యవహరించిన విషయం తెలిసిందే. మరోసారి ఈ బాధ్యతలు అప్పగించడంపై పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# గ్రామల అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలి

## – వర్షకొండ జీపీ పాలకవర్గానికి నాగమణి ఘన సన్మానం

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**




జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులను మెండే నాగమణి, గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ.. రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా, గ్రామల అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. అలాగే పంచాయతీ పాలకవర్గలు ప్రజలతో మమేకం కావాలని, అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్, ఉప సర్పంచ్ తుమ్మల జయ, వార్డ్ సభ్యులు దుబాసి నవనీత, ఆవుల శ్రీనివాస్, కాళేశ్వరం రాకేష్, పిప్పు చంద్ర శేఖర్, గుర్రు లీలా, అరె సాయమ్మ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మెండే పెద్ద ముత్తన్న,దుబాయ్ నుండి గ్రామ నూతన పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలియజేసారు.

# ఆటో డ్రైవర్ల మానవత్వానికి జై..!

- చేయి చేయి కలిపి..గుంతలను పూడ్చి..!
- అధ్వాన్నంగా బట్టల బజార్ బ్రిడ్జి
- బ్రిడ్జిపై అడుగడుగునా గుంతలు
- మానవత్వంతో రోడ్డుకు ఆటోడ్రైవర్ల మరమ్మతు
- స్థానికుల నుంచి ప్రశంసలు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం



**వేద న్యూస్, కరీమాబాద్:**

ఆటో డ్రైవర్ల మానవత్వానికి ప్రశంసలు కురుస్తున్నాయి. గుంతలతో ఉన్న రోడ్డను స్వయంగా బాగుచేశారు. సామాన్యులకు ప్రమాదాలు జరగకుండా చేయిచేయి కలిపారు. ఓ వైపు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూనే.. మరో వైపు సొంత డబ్బులతో రోడ్డును బాగు చేసి తమ మంచి మనసుతో సమాధానం చెప్తున్నారు. వరంగల్ బట్టల బజార్ నుంచి కరీమాబాద్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న బ్రిడ్జిపై అడుగడుగునా ఏర్పడిన లోతైన గుంతలు వాహనదారులకు శాపంగా మారాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చిన్న వాణిజ్య వాహనాలు ప్రయాణించాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. రాత్రివేళల్లో గుంతలు కనిపించక అనేకసార్లు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఇదే బ్రిడ్జిపై ఓ ఆటో గుంతలో పడిపోయిన ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు గాయాలపాలవ్వడంతో స్థానికుల్లో ఆందోళన మరింత పెరిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని ప్రమాదాలు తప్పవు అంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **ప్రజాప్రతినిధులు,అధికారుల స్పందన లేకపోవడంతో..**

ప్రమాదాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం స్పందించకపోవడంతో చివరకు ఆటో డ్రైవర్లు చేతులు కలిపారు. ఇంకా ఎంతమంది గాయపడాలి? అన్న ప్రశ్నతో వారు స్వయంగా ముందుకొచ్చారు. సొంత డబ్బులతో మట్టి, రాళ్లు తెప్పించి, ప్రమాదకరమైన గుంతలను పూడ్చారు. ఎలాంటి ప్రమాదాలు జరగొద్దన్న ఉద్దేశంతో ఆటో డ్రైవర్లందరూ చేతులు కలిపారు.

**పెద్ద ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?**

ఆటో డ్రైవర్ల మానవత్వం స్థానికులను కదిలించింది. ప్రభుత్వం చేయాల్సిన పనిని సామాన్యులు చేస్తున్నారు.. అంటూ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. అదే సమయంలో అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జిపై పరిస్థితిని చూసిన స్థానికులు.. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితేనే రోడ్డు మరమ్మతులు చేస్తారా? అంటూ నిలదీస్తున్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఈ మార్గంలో శాశ్వత మరమ్మతులు చేయాలని, బ్రిడ్జిపై పూర్తిస్థాయి రీసర్ఫేసింగ్ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో మరోసారి రోడ్ల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యం బయటపడిందని స్థానికులు అంటున్నారు. తక్షణమే సంబంధిత శాఖలు స్పందించి, బ్రిడ్జిపై శాశ్వతంగా గుంతలు పూడ్చి రహదారిని సురక్షితంగా మార్చాలని కోరుతున్నారు. అప్పటివరకు ఆటో డ్రైవర్ల మానవత్వమే వాహనదారులకు రక్షణగా నిలుస్తోందన్న వాస్తవం సమాజాన్ని ఆలోచింపజేస్తోంది.

# నేల ఆరోగ్యం-సారవంతంపై శిక్షణ



**వేదన్యూస్, దామరచర్ల:**

దామరచర్ల మండలం బోతలపాలెం ప్రభుత్వ పాఠశాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద నేల ఆరోగ్యం, సారవంతం అనే అంశంపై సోమ వారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భం గా మండల వ్యవసాయ అధికారి ఎం.ఋషేంద్రమణి మాట్లాడుతూ.. నేల యొక్క ప్రాముఖ్యత గురించి వివరిం చారు. పంటకి ఎంత మోతాదులో పోషకాలు అవసరం అవుతాయో, నేలలో ఏ పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో పంటకి ఎంత అవసరం మేరకు వాడాలో తెలుసుకోవడానికి మట్టి నమూనా టెస్టింగ్ విధానం ఉపయోగపడుతుందన్నారు. దాని కోసం మట్టి నమూనా సేకరించడం, టెస్టింగ్ గురించి సాయిల్ హెల్త్ కార్డ్ మొబైల్ యాప్‌ను ఉపయోగించడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు పార్వతి, ప్రియాంక, సైదులు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు హాజరయ్యారు.

# దామరచర్ల ఎంఈవోకు సన్మానం




**వేద న్యూస్, దామరచర్ల:**

దామరచర్ల మండల నూతన విద్యాధి కారిగా బాధ్యతలు స్వీకరించిన కేతావత్ సైదానాయక్‌ను తెలుగు పాఠశాల సము దాయ భాషోపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా సీనియర్ భాషోపాధ్యాయులు రామా వత్ లాలు, గుడిపాటి కోటయ్య, ధనావత్ సీతా రాములు మాట్లాడుతూ.. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా ఉన్న సైదా నాయక్ మండల విద్యాధి కారిగా బాధ్యతలు స్వీకరించడం తెలుగు కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ సైదా నాయక్ మాట్లాడుతూ.. తెలుగు కాంప్లెక్స్ ఉపాధ్యాయులు భాషా బోధనలో మెళకువలను విద్యార్థులకు నేర్పించి వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాషోపాధ్యాయులు జయరాజు, జానయ్య, భగవాన్, శ్రీనివాస్, కోట నాయక్, మక్లా, రాజశేఖర్ రాము, మంగమ్మ నాగమణి, జ్యోతి, జయమ్మ, రాధ, విజయ, పద్మ, లక్ష్మీబాయి రత్నప్రభ, నరసింహ నీల్యా తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపురంలో సీపీఐ శతజయంతి ఉత్సవాలు



**వేదన్యూస్, దామరచర్ల:**

సీపీఐ శత జయంతి ఉత్సవాలను దామర చర్ల మండలంలోని నర్సాపురం గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా కనకయ్య జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడా రు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్, సహాయ కార్యదర్శి ధనావత్ శాంత, లక్ష్మీ నర్సింహారెడ్డితోపాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 2025లో నేరాలు తగ్గాయ్..

- రోడ్డు ప్రమాద మరణాలు 29 శాతం తగ్గుదల
- డీడీ, గేమింగ్ యాక్ట్ కేసుల్లో కఠిన చర్యలు
- డయల్ 100 స్పందన సమయం మెరుగుదల
- మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు



**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

2025 సంవత్సరంలో మెదక్ జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాద మరణాలు సుమారు 29 శాతం తగ్గినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు వెల్లడించారు. అలాగే ఆర్థిక లాభం కోసం జరిగిన దోపిడీలు, ఆస్తి వివాదాల నేపథ్యంలో జరిగిన హత్యలు, రాత్రి సమయాల్లో ఇళ్లలో జరిగిన దొంగతనాలు, చైన్ స్నాచింగ్, మోసాలు, హత్యాయత్నాలు వంటి ప్రధాన నేరాలు 2024 సంవత్సరంతో పోల్చితే 2025లో గణనీయంగా తగ్గినట్లు తెలిపారు. ఈ విజయాలు సమర్థవంతమైన ముందస్తు పోలీసింగ్, పటిష్టమైన నిఘా చర్యలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, అలాగే వివిధ శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం వల్ల సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. నిరంతర పర్యవేక్షణ, పోలీసుల దృశ్యమానత పెంపు, ప్రజల భాగస్వామ్యంతో కూడిన కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమాల ద్వారా నేరాల గుర్తింపు, విచారణ, స్పందన మరింత బలపడిందని తెలిపారు. ఫలితంగా ప్రజా భద్రత మెరుగుపడి, పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసం మరింత పెరిగిందని చెప్పారు. 2024తో పోల్చితే 2025లో రోడ్డు ప్రమాదాలు 29 శాతం తగ్గుదల నమోదు కావడం సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సాయంత్రం 2 గంటల పాటు వాహన తనిఖీలు చేయడం వలనే రోడ్డు ప్రమాద మరణాలు ఘనణీయంగా తగ్గిందని స్పష్టం చేశారు. అలాగే 2024తో 6500 కేసులు నమోదు చేయగా 2025 సంవత్సరంలో మొత్తం 11,800 డీడీ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

**గేమింగ్ యాక్ట్ కేసుల వివరాలు..**

2024 సంవత్సరంలో గేమింగ్ యాక్ట్ కింద 38 కేసులు నమోదు కాగా, 265 మంది అరెస్టు చేయడం జరిగిదని, రూ.9 లక్షల 70 వేల నగదు సీజ్ చేయడం జరిగింది. 2025 సంవత్సరంలో గేమింగ్ యాక్ట్ కింద 73 కేసులు నమోదు కాగా, 472 మంది అరెస్టు చేయడం జరిగి, రూ.18 లక్షల 18 వేల నగదు సీజ్ చేయడం జరిగిందని తెలిపారు.

**డయల్ 100 కాల్స్ వివరాలు..**

2024 సంవత్సరంలో డయల్ 100కు సుమారు 38,000 కాల్స్ రాగా, సగటు స్పందన సమయం 8 నిమిషాలుగా ఉండేదని తెలిపారు. 2025 సంవత్సరంలో 37,872 కాల్స్ అందగా, సగటు స్పందన సమయం 4.33 నిమిషాలకు తగ్గిందని వెల్లడించారు. అలాగే గ్రామపంచాయితీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తుతో కీలక పాత్ర పోషించామని, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని వెల్లడించారు. ప్రజలు పోలీస్ శాఖతో కలిసి పనిచేసినప్పుడే శాంతియుత, సురక్షిత సమాజం సాధ్యమవుతుందని పేర్కొంటూ, ఏ చిన్న సమాచారం అయినా పోలీసులకు అందించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# చైనా మంజా పూర్తిగా నిషేధం




**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

మెదక్ జిల్లా పరిధిలో చైనా మంజాను పూర్తిగా నిషేధించి నట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చైనా మంజాపై నిషేధం విధించిన నేపథ్యంలో, నిబంధనలకు విరుద్ధంగా చైనా మంజాను విక్రయించినా, వినియోగించినా లేదా దాని వల్ల ఎవరికైనా ప్రమాదం సంభవించినట్లయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేస్తారని తెలిపారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారయ్యే చైనా మంజా పర్యావరణానికి తీవ్ర హాని కలిగించడంతో పాటు, సాధారణ ప్రజలు, వాహనదారులు, పక్షులకు ప్రాణాపాయం కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. చైనా మంజాతో గాలిపటాలు ఎగురవేసే సమయంలో గతంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు సైతం తీవ్రంగా గాయపడిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. ఈ కారణాల వల్లనే చైనా మంజాపై పూర్తిస్థాయి నిషేధం విధించబడిందని జిల్లా ఎస్పీ వివరించారు. చైనా మంజా విక్రయాలు, వినియోగంపై పర్యావరణ పరిరక్షణ చట్టం – 1986 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో ఎక్కడా చైనా మంజా విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు చైనా మంజాను ఉపయోగించకుండా, ఎవరికీ హాని కలగని సాధారణ దారాలతో గాలిపటాలు ఎగురవేయాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా చైనా మంజా విక్రయిస్తున్నట్లు లేదా వినియోగిస్తున్నట్లు గమనించినట్లయితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

# ప్రపంచ వేదికపై మెరిసిన దేవాపూర్ చిన్నారులు

- కూచిపూడి నృత్య ప్రదర్శనలో గిన్నిస్ రికార్డు
- అసాధారణ ప్రతిభ కనబరిచిన కలవేన సంస్కృతి, మహంతి విష్ణు ప్రియ
- అభినందిస్తున్న గ్రామస్తులు





**వేద న్యూస్, కాసిపేట:**

దేవాపూర్ గ్రామానికి చెందిన డీఏవీ ఓరియంట్ జ్ఞాన్ మందిర్ పాఠశాల విద్యార్థినులు కలవేన సంస్కృతి, మహంతి విష్ణు ప్రియ తమ అసాధారణ కూచిపూడి నాట్య ప్రతిభతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో స్థానం సంపాదించి పాఠశాలకే కాకుండా దేవాపూర్ గ్రామానికి విశేష గౌరవాన్ని తెచ్చిపెట్టారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల 27న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా నిర్వహించిన కూచిపూడి కళావైభవం2 మహోత్సవంలో దేశ నలుమూలల నుంచి వచ్చిన 5,700 మంది కూచిపూడి కళాకారులు ఒకే వేదికపై సమన్వయంతో నాట్య ప్రదర్శన ఇచ్చి గిన్నిస్ ప్రపంచ రికార్డును సృష్టించారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో దేవాపూర్ గ్రామానికి చెందిన కలవేన సంస్కృతి, మహంతి విష్ణు ప్రియలు పాల్గొని తమ ప్రతిభతో ప్రపంచ రికార్డులో తమ పేర్లను సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారు. ఈ ఘన విజయాన్ని సాధించిన చిన్నారులను డీఏవీ ఓరియంట్ జ్ఞాన్ మందిర్ పాఠశాల ప్రధానాచార్యులు సీహెచ్ కిరణ్ కుమార్, అదానీ సిమెంట్స్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, అలాగే పలువురు ప్రముఖులు హృదయపూర్వకంగా అభినందించారు. చిన్నారుల భవిష్యత్ మరింత ఉన్నతంగా వెలుగొందాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలవేన సంస్కృతి తల్లిదండ్రులు కలవేన లలిత-శ్రావణ్ కుమార్, మహంతి విష్ణు ప్రియ తల్లిదండ్రులు మహంతి హైమావతి – రామ వీరభద్ర రావు మాట్లాడుతూ.. పిల్లలు చదువుతో పాటు కళలు, క్రీడలలోనూ నైపుణ్యం సాధించినప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని, అందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం అత్యంత కీలకమని తెలిపారు. ప్రస్తుతం కలవేన సంస్కృతి మందమర్రిలోని శ్రీ సాయి నాట్య కళానికేతనంలో ప్రముఖ నాట్య గురువు శ్రీమతి అశ్వినీ వద్ద శిక్షణ పొందుతుండగా, మహంతి విష్ణు ప్రియ కామ్రే రేఖారవి వద్ద నర్తనరేఖ నాట్యక్షేత్రం, ఐబీ తాండూర్, బెల్లంపల్లి కేంద్రంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలలో కూచిపూడి నాట్య శిక్షణ పొందుతోంది. శాస్త్రీయ నాట్య విద్యను అభ్యసిస్తూ తమ కళా ప్రయాణాన్ని మరింత శిఖరాల వైపు తీసుకువెళు న్నారు. ఈ విజయం దేవాపూర్ గ్రామానికి గర్వకారణంగా నిలవడమే కాకుండా, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవనుంది.

# వలంటీర్లకు కుట్టు శిక్షణ మూల్యాంకనం



**వేద న్యూస్, కాసిపేట:**

ముత్యంపల్లి, ధర్మారావుపేట రైతు వేదికలు, దేవాపూర్ కమ్యూనిటీ హాల్ వేదికలుగా కాసిపేట మండలం 100శాతం అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులకు చదువు నేర్పిన అక్షర వలంటీర్లకు కుట్టు శిక్షణ మూల్యాంకన కార్య( కమాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంచిర్యాల జిల్లా వయోజన విద్యాశాఖ ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తం ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాసిపేట మండలాన్ని 100శాతం అక్షరాస్యత సాధించిన మండలంగా నిలిపిన అక్షర వలంటీర్లను అభినందించారు. కుట్టు శిక్షణను నేర్చుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాలను ఆర్థికంగా స్థిరపరచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సునీల్ దేస్ పాండే, ఎంపీపీ సఫ్దర్ అలీ, ఏపీఎం రాజ్ కుమార్, వయోజన విద్యాశాఖ డీఆర్‌పీలు బండ శాంకరి, ఎం. సుమన్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది లక్ష్మీనారాయణ, లక్ష్మీ, పలువురు అధికారులు, అక్షర వలంటీర్లు పాల్గొన్నారు

వేద న్యూస్

మంగళవారం డిసెంబర్ 30, 2025

# విద్యార్థులకు కళల పట్ల అవగాహన కల్పించాలి

**– జాతీయస్థాయి కళోత్సవంలో అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థినికి రెండో స్థానం**



**వేద న్యూస్, హనుమకొండ:**

విద్యార్థులకు కళల పట్ల అవగాహన కల్పించాలని వాటిలో పాల్గొనేలా ప్రోత్సాహం అందించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో గల ఆల్ఫోర్స్ ఐఐటి, నీట్ అకాడమీలో ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ కళలపట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని మరియు వాటిలో పాల్గొనేలా ప్రోత్సాహం అందించడంతోపాటు కావలసినటువంటి వనరులను సమకూర్చినట్లైతే వారు వివిధ రంగాలలో నిష్ణాతులవడమే కాకుండా ఘనవిజయం నమోదు చేస్తూ ఉత్తమ ఖ్యాతిని గడిస్తానని వారు చెప్పారు. మన భారత దేశంలో వివిధ రకాల కళలు ఉన్నాయని ఆ కళల ద్వారానే మన భారతదేశానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నదని ప్రధానంగా కళలో పాల్గొనే వారికి చాలా చక్కటి భవిష్యత్తు ఉంటుందని కావున ప్రతి ఒక్కరు కళలో పాల్గొనేందుకు ఆసక్తి చూపాలని సూచించారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో నిర్వహించినటువంటి జాతీయస్థాయి కళోత్సవ్ పోటీలలో కళాశాలకు చెందినటువంటి కే.మైత్రి తేజల్, ఇంటర్మీడియట్ పదమ సంవత్సరం, అత్యుత్తమ ప్రదర్శన కనబరచడమే కాకుండా జాతీయస్థాయిలో రెండవ బహుమతిని కైవసం చేసుకున్నదని హర్షం వ్యక్తం చేస్తూ విజేతకు ప్రశంసా పత్రాన్ని అందజేసి భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన విజయాన్ని నమోదు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్పంచ్, ఉప సర్పంచ్ కు ఉపాధ్యాయుల సన్మానం

**వేద న్యూస్, నల్లబెల్లి :**



ఇటీవల నల్లబెల్లి నూతన సర్పంచిగా పదవి బాధ్యతలు స్వీకరించిన, గతంలో విద్యారంగంలో పనిచేసిన నాగెల్లి జ్యోతి ప్రకాష్, ఉపసర్పంచ్ గుమ్మడి వేణు, పంచా యతీ కార్యదర్శి ధర్మేందర్ లను నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపా ధ్యాయుడు ఉడుత రాజేందర్ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు బడుగు బలహీన వర్గాలకు అందే విధంగా కృషిచేసి, నల్లబెల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించుటకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కర్ణకంటి రామ్మూర్తి, చందా రాజేందర్, శనిగరం శ్రీనివాస్, సతీష్, జన్ను శ్రీనివాసులు, బలరాం నాయక్, లక్కార్స్ ఈశ్వర్, మనోహర్ స్వామి, కుమారస్వామి, గ్రామస్తులు బూస లక్ష్మణమూర్తి, సాల్మన్, నన్నసాహెబ్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# చైనా మాంజాతో గాలిపటాలు ఎగర వేయొద్దు

- పంట చేలల్లో చెత్త కాల్చేటప్పుడు జాగ్రత్త
- అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉందొ అటవీ శాఖ అధికారుల హెచ్చరిక
- కాసిపేట మండలంలో అవగాహన కార్యక్రమం



**వేద న్యూస్, కాసిపేట:**

కాసిపేట మండలంలోని కాసిపేట, ముత్యంపల్లి, చింతగూడ గ్రామాల్లో చైనా మాంజాలతో గాలిపటాలు ఎగరేయడం వల్ల కలిగే ప్రమాదాలపై అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని దుకాణాల్లో చైనా మాంజా విక్రయాలపై తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి. ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లో ఆకులు రాలిపోయిన కారణంగా అగ్ని ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉందని తెలిపారు. అటవీ ప్రాంతాల పరిసరాలలో పంట చేనుల్లో చెత్తను కాల్చే సమయంలో మంటలు అకస్మాత్తుగా అటవీ ప్రాంతంలోకి వ్యాపించే అవకాశం ఉన్నందున రైతులు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వన్యప్రాణుల తాకిడి నుంచి పంటలను కాపాడుకునే క్రమంలో సోలార్ తీగలకు విద్యుత్ తీగలను అనుసంధానం చేసి జంతువులను హతమార్చితే చట్టరీత్యా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే మన అటవీ ప్రాంతంలో పెద్దపులుల కదలికలు ఉన్నందున గ్రామస్తులు అటవీ శాఖ సూచనలను పాటిస్తూ మాత్రమే చేనులకు వెళ్లాలని సూచించారు. గాలిపటాలు ఎగరేసే సమయంలో తప్పనిసరిగా కాటన్ దారం ఉపయోగించాలని, చైనా మాంజాలను వాడకూడదని తెలిపారు. ప్లాస్టిక్‌తో తయారైన చైనా మాంజా దారంపై గాజు పొడి పూయడం వల్ల అది అత్యంత పదునుగా మారి పిల్లలు, మనుషులు, పక్షులు, అడవి జంతువులకు తీవ్ర గాయాలు కలిగి ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర పర్యావరణ చట్టం2016 ఉత్తర్వుల ప్రకారం చైనా మాంజాను నిషేధించారని తెలిపారు. చైనా మాంజాను రవాణా చేసినా, నిల్వ ఉంచినా లేదా దాని వల్ల మనుషులు, పక్షులకు ప్రమాదం జరిగితే మూడు సంవత్సరాల నుండి ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించబడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ప్రజాప్రతినిధులకు సన్మానం

**వేద న్యూస్, కాసిపేట:**



నూతనంగా సోనాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన అర్క మహేందర్, ఉప సర్పంచ్ కోర్వేత శంకర్, వార్డు మెంబర్లకు సోనాపూర్ గ్రామం బాధుగూడెంలో యువతి, యువకులు, పటేల్, గ్రామ పెద్దలు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అర్క మహేందర్‌తో, వార్డు మెంబర్లు అడ వశాంత్, పెంద్రం పతుబాయి, గెడం శంకరమ్మ, అర్క శంకర్, కనక మౌనిక, కొలకని శేఖర్, పుస్నక అరుణ, ఆత్రం మారుతిని ఘనంగా అభినందించారు. అలాగే పంచాయతీ సెక్రటరీ రామును కూడా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కనక మారు, కనక మహేష్, బక్క రాజన్న, చహ్కటి జైతు, కనక మనుకు, వెడ్మ తిరుపతి, కుడ్మెత విజయ్, కనక రాము తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి నూతన ప్రజాప్రతినిధులు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

# డ్రైనేజీలు శుభ్రం చేయించిన సర్పంచ్




**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని జేయన్సీ కాలనీలోని 13, 14వ వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ అపరిశుభ్రంగా మారింది. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ సోమవారం పరిశుద్ధ కార్మికులను ఏర్పాటు చేసి డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తుండటం తో స్థానిక కాలనీవాసులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ ప్రేమ్ దాస్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, వార్డు మెంబర్ వడ్ల అమృత నరేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాసిపేటలో భూ వివాదం

**– న్యాయం చేయాలని తహసీల్దార్ కు బాధిత కుటుంబం వినతి**



**వేద న్యూస్, కాసిపేట:**

భూమి విషయంలో కొంతమంది బంధువులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ గతంలో తన కుటుంబంపై దాడులు చేశారని, 2005లో జరిగిన దాడిలో తన తల్లి గాయపడ్డారని, ఇటీవల తన భార్యపై కూడా దాడి జరిగి కేసులు నమోదు అయ్యాయని కాసిపేట మండల కేంద్రానికి చెందిన పోలవేణి శ్రీనివాస్ వాపోయారు. మండల కేంద్రంలో తనకు వంశపారపర్యంగా వచ్చిన ఇంటి నెంబర్ 3-95/4కు అనుకొని ఉన్న 6 గుంటల పెరడు భూమి విషయంలో న్యాయం చేయాలంటూ కాసిపేట తహసీల్దార్ సునీల్ దేస్ పాండే కు వినతి పత్రం అందజేశారు. తను ప్రత్యర్థుల భయంతో కుటుంబంతో కలిసి ఆసిఫాబాద్‌కు వెళ్లాల్సి వచ్చిందని వాపోయారు. తన వద్ద భూమికి సంబంధించిన పత్రాలు, ఇంటి పన్ను రసీదులు ఉన్నాయని పేర్కొంటూ, పోలవేణి తిరుపతి, అతని భార్య రాజేశ్వరి తమను నిరంతరం బెదిరిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు మానవీయంగా స్పందించి తమ భూమి తమకే చెందేలా న్యాయం చేయాలని కోరారు.

# డీఏలు, పీఆర్సీ ప్రకటించాలి

**– బకాయిలను విడుదల చేయాలి – మండలిలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య**



**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ శాసనమండలి సమావేశాల్లో బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తారు. మండలి సమావేశాల్లో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ "రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలున్నాయి. విద్యార్థి, విద్యార్థినీలకు కనీసం మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు,ఈ సమస్యలను పరిష్కరించాలి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానంను రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలు చేస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి ఎక్కువ మొత్తంలో వచ్చే నిధులతో ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు వారికి బంగారు భవిష్యత్తును అందించగలం. మోడల్ స్కూల్స్, కస్తూర్బా విద్యాలయాల్లో ఉపాధ్యాయులు చాలా ఏండ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. రూ.10 వేలు, రూ.12 వేలు, రూ.20 వేలు తదితర చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారు. వారికి పే స్కేలు అమలు చేయడంతోపాటు వారిని రెగ్యులరైజ్ చేయాలి. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న దాదాపు 3 వేల మంది రెగ్యులర్ ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి.. వారికి 010 పద్దు ద్వారా వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలి"అని సభలో ప్రస్తావించారు.

**రేషనలైజేషన్ చేయాలి**

ప్రభుత్వ బడుల్లో జీరో ఎన్ రోల్ మెంట్ గురించి సభలో మాట్లాడిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య.. పశ్చిమ బెంగాల్ తర్వాత తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. "2024-25 అకడమిక్ ఇయర్ లో మన రాష్ట్రంలో 2,245 స్కూళ్లలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకుని ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించాలి. విద్యార్థులు ఉన్న చోట టీచర్ల కొరత ఉన్నది.. టీచర్లు ఉన్న చోట విద్యార్థులు లేరు.. కాబటి రేషనలైజేషన్ చేయాలి. రాష్ట్రంలో డీఏలు పెండింగ్ లో ఉన్నాయి. పీఆర్సీ ఇవ్వలేదు. వీటిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలి. ప్రభుత్వం కొంత తాత్కాలిక ఉపశమనం కలిగించినా.. సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. టీచర్లు 100 నుంచి 150 కిలోమీటర్లు ట్రావెల్ చేసి బడికి వెళ్లాల్సి వస్తున్నది. 317 జీవో సమస్యలు పూర్తిగా పరిష్కరించాలి"అని ఎమ్మెల్సీ కోరారు.

**పెండింగ్ బకాయిలు..**

మార్చి 2024 తర్వాత రిటైర్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇప్పటి వరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించలేదని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సభ దృష్టికి తెచ్చారు. దాదాపు 14,000 మంది పెన్షనర్లు బకాయిల కోసం ఎదురు చూస్తున్నారని, తక్షణమే వాటిని చెల్లించాలని కోరారు. "బకాయిలు నెలకు రూ.700 కోట్లు చెల్లిస్తామని కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నా.. ఇంతవరకూ అది అమలు కాలేదు. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి. 2010 కంటే ముందుగా నియామకం అయిన టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మంచి హెల్త్ స్కీమ్, క్యాష్ లెస్ హెల్త్ కార్డు తీసుకువస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా.. ఇప్పటి వరకు అది జరగలేదు. దాన్ని వెంటనే అమలు చేయాలి. వందలాది ప్రభుత్వ బడులు, గురుకులాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గురుకుల టీచర్లు అనేక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం వాటిని అడ్రస్ చేయాల్సిన అవసరం ఉంది " అని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సభలో మాట్లాడారు.

# అంగన్వాడీ చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ

**వేద న్యూస్, రుద్రూర్:**



ఆపదలో ఉన్నవారికి ముందుండి సహాయం చేసే వ్యక్తిగా పేరుగాంచిన జిల్లా ట్రాస్మా అధ్యక్షుడు, ఇందూర్ పాఠశాల ఓల అధినేత లయన్ కోడాలి కిషోర్ జన్మదినాన్ని పురస్కరించుకొని రుద్రూర్ మండలంలోని సులేమాన్ నగర్, రాయకూర్ గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలలో సోమవారం చిన్నారులకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు పండ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ రుద్రూర్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. లయన్ కోడాలి కిషోర్ ఎప్పుడూ సేవాభావంతో పనిచేసే వ్యక్తి అని, ఆయన చేస్తున్న సేవలు మరువలేనివని అన్నారు. ఆయనకు దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లయన్ శ్యామ్ సుందర్ పహడే, కార్యవర్గ సభ్యులు లయన్స్ పుట్టి సాగర్, మధు, శ్రీకాంత్ గౌడ్, అంగన్వాడీ టీచర్లు రత్న కుమారి, రుక్మిణి, సాయిలీల, ఆయమ్మలు, చిన్నారులు పాల్గొన్నారు.

# దేవాపూర్ ఎస్ఐకి సన్మానం

**వేద న్యూస్, కాసిపేట:**



కాసిపేట మండలం దేవాపూర్ లో విధులు నిర్వహిస్తున్న స్థానిక ఎస్.ఐ గంగారంను తాటిగూడ గ్రామ సర్పంచ్ మడావి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా నిరంతరం కృషి చేస్తున్నందుకు ఎస్ఐకి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పాత్ర ఎంతో కీలకమని పాల్గొన్నవారు పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో తాటిగూడ సర్పంచ్ మడావి వెంకటేష్, గ్రామ పటేల్ మేకల చంద్రయ్య, తుంగగూడ వార్డ్ మెంబర్ గుండవేని శేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యాల నాగేష్, చంచు జనార్ధన్, నేరెళ్ల నర్సింగ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేటకు చెందిన బగ్గి రాజయ్య తండ్రి బగ్గి రాములు అనారోగ్యంతో మృతి చెందడంతో, 199091 ఎస్ఎస్సీ బ్యాచ్‌కు చెందిన ఆయన స్నేహితులు కుటుంబానికి రూ.5,091 నగదు సహాయాన్ని అందించారు. తోటి మిత్రుడి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సహాయం చేసినట్లు ఎస్ఎస్సీ 1991 గ్రూప్ కన్వీనర్ శాగంటి స్వామి తెలిపారు. మా గ్రూప్‌కు చెందిన మిత్రులకు ఎలాంటి ఆపద వచ్చినా వెంటనే స్పందిస్తూ సహాయం చేస్తున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో శాగంటి స్వామితో పాటు బసాని విద్యాసాగర్, కూరకుల రవి, రాజశేఖర్, సురేందర్, ప్రకాష్, సదానందం, సామల శంకర్ పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం డిసెంబర్ 30, 2025

# జిల్లాలో ఎరువుల కొరత లేదు

- సాగుకు సరిపడా నిలువలు ఉన్నాయి
- రైతులు ఆందోళన చెందవద్దు
- సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో ఆయా పంటల సాగుకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. యూరియా కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతుల పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులను సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ఎరువులు పక్కదారి పట్టకుండా లేదా ఇతర అవసరాలకు వినియోగించకుండా కఠినంగా పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాలు (సొసైటీలు) మరియు ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులకు కనీస సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో యాసంగి సాగు కోసం మొత్తం 21 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 10,991 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన అవసరమైన యూరియాను కూడా దశలవారీగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రైవేట్ డీలర్లు 223, పీసీసీఎస్ షాపులు 54, డీసీఎంఎస్ 16, ఏఆర్ఎస్‌కే 13 ఎరువుల దుకాణాలు ఉన్నాయని




వెల్లడించారు. అన్ని షాపుల్లో ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల నుంచే యూరియా విక్రయాలు ప్రారంభించాలని ఆదేశించారు. ఎరువుల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మరోసారి సూచించారు.

# మేం వచ్చిందే టైం..

- కమలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది తీరు
- పనుల కోసం వచ్చిన వారికి పడిగాపులే
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

**వేద న్యూస్, కమలాపూర్:**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో కొంతమంది సిబ్బంది, ఉద్యోగులు సమయానికి విధులకు హాజరు కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ అవసరాల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు చాలా సేపు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది, ఉద్యోగులు మెరుగైన సేవలు అందిస్తున్నారన్న నమ్మకం ప్రజల్లో ఇప్పుడిప్పుడే కుదురుకుంటున్న తరుణంలో, ఆ నమ్మకాన్ని వమ్ము చేసే విధంగా కొంతమంది సిబ్బంది, ఉద్యోగులు సమయపాలన పాటించకుండా వారికి కుదిరిన సమయంలో విధులకు హాజరవుతూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రోజున అనేక మంది తమ తమ పనుల నిమిత్తం కమలాపూర్ మండల పరిషత్ కార్యాలయానికి రాగా, కొంతమంది సిబ్బంది, ఉద్యోగులు అందుబాటులో లేక కార్యాలయం ముందు పడిగాపులు కాసిన పరిస్థితి నెలకొంది. ప్రజలు కట్టే పన్నులతో జీతాలు పొందుతున్న ఉద్యోగులు ప్రజలకు తగిన సమయానికి అందుబాటులో ఉండాల్సి ఉండగా, వారి అవసరాలను విస్మరించి సొంత పనులకు ప్రాధాన్యతనిస్తూ విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి సమయపాలన పాటించని సిబ్బంది, ఉద్యోగులపై తగిన చర్యలు తీసుకొని, ఇకనుంచి అయినా సమయపాలన తప్పనిసరిగా పాటించేలా, ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా వారిలో జవాబుదారీతనాన్ని పెంపొందించాలని పలువురు కోరుతున్నారు.

# హద్దు మీరి ప్రవర్తించొద్దు

- న్యూ ఇయర్ వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి
- డిసెంబర్ 31న జిల్లావ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

నూతన సంవత్సర వేడుకలను ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతంగా, సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. న్యూ ఇయర్ వేడుకల పేరుతో ప్రజా భద్రతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిసెంబర్ 31న జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు తప్పనిసరిగా పోలీసుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు, అధిక శబ్దం వచ్చే సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. డిసెంబర్ 31న టపాసులు, మైకులు వినియోగించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం, రాష్ డ్రైవింగ్, సైలెన్సర్ తొలగించి శబ్ద కాలుష్యం సృష్టించడం, ట్రిపుల్ రైడింగ్ వంటి చర్యలకు పాల్పడితే కేసులతో పాటు జైలు శిక్ష కూడా విధించబడుతుందని పేర్కొన్నారు. ఇళ్లు, ప్రైవేట్ ఆస్తులు, వీధి దీపాలపై రాళ్లు వేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం, మహిళలను ఇబ్బంది పెట్టడం లేదా



అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని, వారి వల్ల ప్రమాదం జరిగితే సంరక్షకులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనలను ప్రజలు వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి..

- రాణంపల్లి నూతన సర్పంచ్‌కు సన్మానం
- సేవాభావంతో పాలన సాగించాలని సూచన

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండలం రాణంపల్లి గ్రామ సర్పంచ్‌గా గెలుపొందిన కొండల్‌వాడి శంకర్‌ను సోమవారం సహాయ వాలంటీర్ ఆర్గనైజేషన్ కార్యదర్శి వి.ఎం. శివకుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సహాయ వాలంటీర్ ఆర్గనైజేషన్ కార్యదర్శి వి.ఎం. శివకుమార్ మాట్లాడుతూ, ప్రజలు మీపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా గ్రామ సర్పంచ్‌గా, పాలకవర్గంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రుద్రూర్ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, గ్రామ పెద్దలు వెంకన్నతో పాటు పలువురు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



- అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి
- రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలి
- బీసీ హక్కుల సాధన సమితి డిమాండ్

**వేద న్యూస్, కరీంనగర్:**

బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం బీసీ రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలంటూ ప్రజావాణిలో డీఆర్ఓ వెంకటేశ్వర్లుకు బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యా - ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపి ఏడు నెలలు గడుస్తున్నప్పటికీ, ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అమలుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అన్ని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలను కలుపుకొని ప్రధానమంత్రితో చర్చించాలన్న హామీలు ఇప్పటివరకు ఆచరణకు రాలేదని విమర్శించారు. రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిన చట్టాన్ని అమలు చేయడంలో కేంద్రం చూపుతున్న వైఖరి బీసీల పట్ల ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు చిత్తశుద్ధితో వ్యవహరించి ప్రధానమంత్రిని ఒప్పించి రిజర్వేషన్ల అమలుకు కృషి చేయాలని, లేనిపక్షంలో బీసీ సమాజం ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కోశాధికారి పైడిపల్లి రాజు, కార్యవర్గ సభ్యులు కే. సదానందం, రేగుల కుమార్, జి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీ ఇంజక్షన్ వికటించడంతో వ్యక్తి మృతి

- మృతుడి బంధువుల ఆందోళన

**వేద న్యూస్, తంగళ్లపల్లి:**




రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. అనారోగ్యంతో స్థానిక ఆర్ఎంపీ వద్దకు వెళ్లిన మహమ్మద్ హమీద్ అనే వ్యక్తి, ఇంజక్షన్ తీసుకున్న కొద్దిసేపటికే మృతి చెందడంతో గ్రామంలో కలకలం రేగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, మహమ్మద్ హమీద్‌కు ఛాతీ నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం ఓ ఆర్ఎంపీ వద్దకు వెళ్లాడు. అక్కడ సదరు ఆర్ఎంపీ హమీద్‌కు ఒక ఇంజక్షన్ ఇచ్చారు. అయితే ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే హమీద్ పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయినట్లు వారు తెలిపారు. హమీద్ మృతికి ఆర్ఎంపీ నిర్లక్ష్యమే కారణమని బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. డాక్టర్ ఇచ్చిన ఇంజక్షన్ వికటించడం వల్లే తమ మనిషి మృతి చెందాడని కన్నీరుమున్నీరవుతూ వాపోయారు. సరైన అవగాహన లేకుండా మందులు వినియోగించడమే ఈ అనర్థానికి కారణమని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సదరు ఆర్ఎంపీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# చంద్రంపేట ఎక్స్ రోడ్డును అభివృద్ధి చేయాలి

- ఏఐఎఫ్టీయూ న్యూ రాష్ట్ర సభ్యుడు దశరథం

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




రాజన్న సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట ఎక్స్ రోడ్డును అభివృద్ధి చేయాలని, చంద్రంపేట ఎక్స్ రోడ్ నుంచి మొదటి బైపాస్ రోడ్డుకు 80 అడుగుల రహదారిని అభివృద్ధి చేసి సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి రూ.1 కోటి 80 లక్షల నిధులు మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని ఏఐఎఫ్టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం అన్నారు. ఆ రహదారికి ఇప్పటివరకు తట్టెడు మట్టి కూడా పోయలేదని, పిచ్చి మొక్కలు పెరిగి 80 అడుగుల రోడ్డు ఆక్రమణకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి అభివృద్ధి జరిగితే శ్రీనగర్ కాలనీతో పాటు చంద్రంపేట ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటమే కాకుండా, కొత్తచెరువు కాలువ పరిశుభ్రంగా ఉండి నీటి ప్రవాహానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ స్పందించి చంద్రంపేట ఎక్స్ రోడ్ నుంచి మొదటి బైపాస్ రోడ్డును కలిపే 80 అడుగుల రహదారిని అభివృద్ధి చేయాలని, రోడ్డు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జు దేవదాసు పాల్గొన్నారు.

# మనస్తాపంతో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**వేద న్యూస్, చందుర్తి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. మానసిక సమస్యలతో బాధపడుతున్న ఇందూరి రాములు (45) సోమవారం ఉదయం తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఇందూరి సత్తవ్వ తెలిపిన వివరాల ప్రకారం... రాములు గత కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. గతంలో రెండు వివాహాలు విడాకులతో ముగియడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. 2017 నుంచి మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో చికిత్స అందిస్తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. సోమవారం ఉదయం తల్లి ఇంటి బయట కూర్చుండగా, కొద్దిసేపటి తరువాత ఇంట్లోకి వెళ్లి చూడగా రాములు పైకప్పు దూలానికి ఉరివేసుకుని కనిపించాడు. అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. మనస్థాపంతోనే రాములు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై చందుర్తి ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడికి ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. కుమారుడి మృతితో తల్లి సత్తవ్వ రోదనలు మిన్నంటాయి.

# రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గౌతమి ఎంపిక

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన కొమ్ముల గౌతమి రాష్ట్రస్థాయి అండర్-14 ఖోఖో పోటీలకు ఎంపికైంది. నవంబర్ 11న ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాల మండలం కథలాపూర్‌లో నిర్వహించిన ఖోఖో పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా అండర్-14 బాలికల ఖోఖో జట్టు ప్రాతినిధ్యం వహించింది. ఈ పోటీల్లో పెద్దలింగాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని కొమ్ముల గౌతమి అద్భుతమైన ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో పోటీలకు ఎంపికైంది. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ఈ నెల 29వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా వికారాబాద్‌లో జరగనున్నాయి. రాష్ట్రస్థాయికి ఎంపికైన గౌతమిని, ఆమెకు అత్యుత్తమ శిక్షణ అందించిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సంద్రకారి రాజును పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోయిన తిరుపతి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పెద్దలింగాపూర్ పాఠశాలకు రాష్ట్రస్థాయిలో కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన సంద్రకారి రాజును విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రత్యేకంగా అభినందించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073